

మట్టి వినాయకుని ప్రతిమను కొనుగోలు చేస్తున్న భక్తులు



విక్రయానికి సిద్ధం చేసిన గణపతి విగ్రహాలు



సత్యదేవ నర్సరీలో మొక్కలతో రూపొందించిన వృక్ష గణపతి



కడియపులంకలోని సత్యదేవ నర్సరీలో ఏర్పాటు చేసిన వన గణపతి

పూజకు వేళాయె..

- వినాయక చవితికి సర్వం సిద్ధం
- ముస్తాబైన పందిళ్లు
- మార్కెట్లో కొనుగోలుదారుల రద్దీ
- పూజా సామగ్రి ధరకు రెక్కలు

సీటీఆర్ఐ/కడియం/ప్రకాశం నగర్: వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. వాడవాడలా గణనాథుని ఏర్పాటు చేసేందుకు మంటపాలు సిద్ధమయ్యాయి. వాటిలో ప్రతిష్ఠించే విగ్రహాలు కూడా చేరుకున్నాయి. వినాయక చవితి ఉత్సవాలు శనివారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాలలో పండగ సందడి నెలకొంది. వాడవాడలా బొజ్జ గణపయ్య కొలువుదీరనున్నాడు. తొలిపూజ అందుకునే గణపతి కొలిచేందుకు అందరూ సిద్ధమయ్యారు. పూజకు అవసరమైన వివిధ రకాల పత్రి, పువ్వులు, పండ్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన భక్తులతో మార్కెట్లు కిక్కిరిశాయి. కంబాలచెరువు, జాంపేట, గాంధీబొమ్మ, గోదావరి గట్టు ప్రాంతాలలో పూజా సామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి. పువ్వులు, పండ్లు, పత్రి, గొడుగులు తదితర వాటిని విక్రయించారు. ఇదే అదునుగా పూజా సామగ్రి ధరలను విపరీతంగా పెంచేశారు. పత్రి, పాళి, పూల ధరలు కొండెక్కాయి.

మట్టి ప్రతిమలకు ఆదరణ

పర్యావరణానికి హితమైన మట్టితో చేసిన విగ్రహాలు పూజలో వాడాలని ప్రజలకు అవగాహన వచ్చింది. నగరంలో చాలా చోట్ల దాతలు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రజల్లో కూడా చైతన్యం రావడంతో మట్టి వినాయకుని ప్రతిమలు ఎక్కువగా కొనుగోలు చేశారు.

ఆలయాల ముస్తాబు

నగరంలోని ప్రధాన వినాయక ఆలయాలతో పాటు వీధుల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో పూజలకు ఏర్పాట్లు చేశారు. వాటిని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. శృంగేరి జగద్గురు మహాసంస్థానం, శారదాపీఠం, శంకమఠంలోని రత్నగర్భ గణపతి నవరాత్ర దీక్షా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వంకాయలవారి వీధిలో వెలిసిన అష్టసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కాటన్ దొర బహూకరించిన గంట ఈ ఆలయంలో ఇప్పటికీ కనిపిస్తుంది. పుష్కరఘాట్‌లో అత్యంత వైభవంగా వినాయక వేడుకలను నిర్వహిస్తారు.

పందిళ్లకు చేరిన గణనాథులు

వినాయకుడి చవితికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పందిళ్లకు ఉత్సవ గణనాథులు చేరారు. కాగా.. గణపతి పందిళ్లకు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని ప్రభుత్వ యంత్రాంగం విస్తృత ప్రచారం చేసింది. రెవెన్యూ, పోలీసు, ఫైర్, ఎలక్ట్రిసిటీ విభాగాలకు చెందిన అధికారులు సంయుక్తంగా అనుమతులు ఇస్తున్నారు. ఈ మేరకు సంబంధిత చలానాల చెల్లింపు ప్రక్రియను తప్పనిసరి చేశారు. ఉత్సవ పందిళ్ల వద్ద ప్రతి పనికి ఉత్సవ కమిటీలదే బాధ్యత అని, తగు జాగ్రత్తలు తీసుకుని ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని కడియం ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.

వృక్ష గణపతి

కడియపులంకలో పుల్లా ఆంజనేయులుకు చెందిన సత్యదేవ నర్సరీలో వృక్ష గణపతిని ఏర్పాటు చేశారు. నర్సరీ రైతులు పుల్లా వీరబాబు, రాజశేఖర్ ఆధ్వర్యంలో వివిధ రకాల పువ్వులు, మొక్కలతో గణనాథుని ఆకారాన్ని రూపొందించారు. అలాగే మట్టితో చేసిన వినాయ ప్రతిమలను పంపిణీ చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా వినాయక చవితి చేసుకోవాలని తెలియజేసేందుకు తాము ఈ ఏర్పాట్లు చేసినట్లు నర్సరీ అధినేతలు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నర్సరీ రైతులు పాల్గొన్నారు.

వన గణపతి

కడియపులంకలో పుల్లా చంటియ్యకు చెందిన సత్యదేవ నర్సరీలో వన గణపతిని ఏర్పాటు చేశారు. గణనాథుడికి ప్రీతికరమైన వెలగ, మారేడు కాయలతో పాటు, వివిధ రకాల మొక్కలను వినియోగించి చిత్రాన్ని రూపొందించినట్లు నర్సరీ రైతు పుల్లా పెద సత్యనారాయణ తెలిపారు. ఇందుకోసం వెయ్యి వెలగకాయలు, 500 మారేడుకాయలు, రంగుల రాళ్లు, పదివేల మెండో గ్రాస్, వెయ్యి క్లోరొఫైటం, 500 ఉజీనియా మొక్కలను ఉపయోగించామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలని కోరుతూ ఈ చిత్రాన్ని కూర్పు చేసినట్లు వివరించారు.



కంబాల చెరువు సెంటర్ పూజా సామగ్రి విక్రయాలు, కొనుగోలుదారుల రద్దీ

సాంస్కృతిక కార్యక్రమాలు

పుష్కరఘాట్ వద్ద రాజమహేంద్రవరం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 64 రూపాల్లో సృష్టి గణపతిని ఏర్పాటు చేయనున్నారు. మరికొన్నిచోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా మండపాల కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా వివిధకాల విద్యుత్ దీపాలతో మండపాలను అలకరించడంతో పాటు ప్రతి రోజూ పూజ కార్యక్రమాలు, భక్తులకు ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

ఎమ్మెస్సార్ సేవలను కొనసాగిస్తాం



ఎమ్మెస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న షర్మిలారెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: మేడపాటి సీతారామరెడ్డి సేవలను కొనసాగిస్తామని ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. సీతారామారెడ్డి 76వ జయంతి సందర్భంగా శుక్రవారం ఎమ్మెస్సార్ హైటెక్ బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ సీతారామరెడ్డి రాజమహేంద్రవరంలో అనేక దాతృత్వ కార్యక్రమాలు చేపట్టారన్నారు. టీటీడీ కల్యాణ మంటపం, ఎమ్మెస్సార్ హైటెక్ బస్టాండ్, సుబ్రహ్మణ్యం మైదానంలో ఆడిటోరియం, క్వారీ మార్కెట్ వద్ద గల శివాలయం ఆయన ఆధ్వర్యంలో నిర్మించారన్నారు. అలాగే పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో మేడపాటి అనిల్ రెడ్డి, ఎమ్మెస్సార్ ఫాలోవర్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయలను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఆనందా గార్డెన్స్‌లో శుక్రవారం వృద్ధులకు పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ముగ్గురు పేద విద్యార్థులకు రూ.22 వేలు, 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రూ.40 వేలు అందజేశారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు కాసా జయప్రద, కొత్తపల్లి వీర్రాజు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు, పూర్వ అధ్యక్షుడు సూరపరెడ్డి తాతారావు, క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపిన జీవిత బీమా వారోత్సవాలు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎల్ఐసీ అధికారి సంధ్యారాణి

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా వారోత్సవాలు అందరిలో స్ఫూర్తిని నింపాయని ఎల్ఐసీ రాజమహేంద్రవరం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి అన్నారు మోరంపూడిలోని జీవిత బీమా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ముగింపు ఉత్సవాలలో ఆమె ప్రసంగించారు. వారం రోజుల పాటు జరిగిన వారోత్సవాలలో గిరిజన ప్రాంతాలలో నిత్యావసరాలు అందించడం చాలా ఆనందం కలిగించిందన్నారు. మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ సాహూ మాట్లాడుతూ బీమా వారోత్సవాలను విజయవంతం చేసిన ఎల్ఐసీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం, గాత్రం, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఆర్ఎం మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌బీ మేనేజర్ ప్రసాద్, డీపీ మేనేజర్ శ్రీనివాస్, ఆఫీస్ మేనేజ్మెంట్ మేనేజర్ కె.రేఖ పాల్గొన్నారు.

8న చాంబర్ నూతన భవన ప్రారంభోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ జవ్వార్

రాజమహేంద్రవరం సిటీ: ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ బిల్డింగ్ ట్రస్ట్ నూతన భవన ప్రారంభోత్సవం, వజ్రోత్సవ వేడుకను ఈనెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్టు చాంబర్ పాలకవర్గ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, గౌరవ కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ అన్నారు. చాంబర్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నూతన భవనాన్ని మూడు అంతస్తులుగా నిర్మించామన్నారు. కింది భాగంలో షాపులు, పైన మీటింగ్ హాలు, అతిథులు వచ్చినప్పుడు ఉండడానికి గదులతో పాటు ఓపెన్ హాలు ఉన్నాయన్నారు. సమావేశంలో ట్రస్ట్‌బోర్డు కార్యదర్శి కనకాల రాజా, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



కడియంలో విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

కడియం: విజయవాడ వరద బాధితులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.22,841 విరాళంగా సేకరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, జూనియర్ రెడ్‌క్రాస్ నోడల్ టీచర్ గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జూనియర్ రెడ్‌క్రాస్ విద్యార్థులు ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థుల ప్రయత్నానికి ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వెలుగుబంటి రఘురామ్, ఎస్ఎంసీ అధ్యక్షురాలు పి.సత్య, హెచ్ఎం టి.సత్యనారాయణ, నోడల్ టీచర్ జి.సత్యనారాయణలు కూడా తమ వంతు విరాళం అందజేసి ప్రోత్సహించారు. 30 మంది విద్యార్థులు గ్రామస్తుల నుంచి ఈ విరాళాలను సేకరించారని, ఈ మొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేయనున్నట్లు జి.సత్యనారాయణ తెలిపారు.

రామపాదాల రేవు పరిశీలన



రామపాదాలరేవును పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్య కిషోర్

ధవళేశ్వరం: వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో రామపాదాలరేవులో చేసిన ఏర్పాట్లను దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిషోర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ, ఇరిగేషన్ అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. ప్రస్తుతం వరద ఉధృతి ఎక్కువగా ఉందని, నిమజ్జనం సమయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులకు డీఎస్పీ సూచించారు. అంతకుముందు పద్మావతి కల్యాణ మండపంలో గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో సీఐ టి.గణేష్ సమావేశం నిర్వహించారు. ఉత్సవాల్లో తీసుకోవాల్సిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై నాగేశ్వరరావు, కానిస్టేబుళ్ల సత్తిబాబు, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

వేమగిరిలో వైద్యశిబిరం

కడియం: మండలంలోని వేమగిరిలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 49 మందికి వైద్య పరీక్షలు చేయగా నలుగురు జ్వరంతో ఉన్నట్లు గుర్తించారు. వీరికి డెంగీ, మలేరియా తదితర పరీక్షలు నిర్వహించినట్లు శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు

రాజమహేంద్రవరం సిటీ: రైలు నుంచి దిగుతూ జారి పడటంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. జీఆర్పీ ఎస్ఐ మావుళ్లు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి గ్రామానికి చెందిన 24 ఏళ్ల విల్లా వినయ్ కృష్ణ గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వస్తున్నాడు. అయితే స్టేషన్‌లో రైలు పూర్తిగా ఆగకుండానే దిగిపోవడంతో అదుపు తప్పి ప్లాట్‌ఫాంపై పడిపోయాడు. అతడి నడుముకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

ఆవ కాలువపై ఆక్రమణల తొలగింపు



చెరుకూరి గోడౌన్స్‌లో కాలువలో పడేందుకు సిద్ధంగా ఉన్న ఐరన్‌గదులు



ఆవ కాలువ వెంబడి ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట పంచాయతీ పరిధిలో ఆవ కాలువ వెంబడి ఆక్రమణల తొలగింపునకు శుక్రవారం ఉదయం అధికారులు శ్రీకారం చుట్టారు. ఆవకాలువ ఆక్రమణల కారణంగా హుకుంపేట, బొమ్మూరులోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నట్టు ఇటీవల కలెక్టర్ పి.ప్రశాంతి గమనించారు. వెంటనే ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ జేఎస్.లక్ష్మీరమ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు జేసీబీలతో ఆక్రమణలను తొలగించారు. ఎస్‌టీ ప్లాంట్ నుంచి బాలాజీపేట దుర్గగుడి వరకు ఉన్న ఆక్రమణలను తొలగించడానికి ప్రణాళిక సిద్ధమైంది. ముందుగా ఆవకాలువకు సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న షాపులను, జాతీయ రహదారి పక్కన ఆక్రమణలను తొలగించారు. ఆవకాలువ అటువైపు ఉన్న భవనాలు, ప్రహరీలు, చెట్లను కూడా తొలగించారు. పేదలు, వృద్ధులు నివసిస్తున్న ఇళ్లను కొద్ది రోజుల్లో ఖాళీ చేసి వేరొక చోటకు వెళ్లిపోవాలని లేనిపక్షంలో ఇళ్లను తొలగించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. జాతీయ రహదారి పక్కన ఉన్న సిద్ధార్థ కాంపౌండ్‌లో ప్రహరీ, మరుగుదొడ్లు, మూడంతస్తుల భవనం ఆవకాలువపై ఆక్రమించుకుని నిర్మించారు. వాటిని తొలగించాలని సదరు యజమానికి ఆదేశాలు జారీ చేశారు. చెరుకూరి గోడౌన్స్‌లో వెనుక ప్రాంతంలో ఆవకాలువను ఆక్రమించుకోవడం జరిగింది. ఈ ఆక్రమణలో రిలయన్స్‌కు సంబంధించిన ఐరన్‌తో చేసిన గదులు సైతం కాలువలోకి ఒరిగి ఉన్నాయి. ఇవి కాలువలో పడితే రాజమహేంద్రవరం నగరం నుంచి వచ్చే నీరు ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదు. ఇప్పటికే ప్రహరి కాలువలో పడిపోయింది. జాతీయ రహదారిపై ఉన్న సీతారామ టింబర్‌డిపో యాజమాన్యం కోరిక మేరకు ఆదివారం సాయంత్రం వరకు గడువు ఇచ్చారు. సోమవారం ఆక్రమణల తొలగింపు యథాతథంగా జరుగుతుందని అధికారులు తెలిపారు.

సినిమాలు



శ్యామల : 35 చిన్నకథకాదు
సూర్యమినీ : 35 చిన్నకథకాదు
సూర్యప్యాలెస్ : సరిపోదా శనివారం
స్వామి : సరిపోదా శనివారం
అశోక : ఆయ్
శివజ్యోతి : ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్)
అనుశ్రీ : ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)
రాజా : ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్)
రంభ : మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం, ఉరుకు పటేలా
ఊర్వశి : కమిటీ కుర్రోళ్లు
మేనక : తంగలాన్
కుమారి : సరిపోదా శనివారం
అప్సర : సరిపోదా శనివారం

నామవరం

మీఎస్ మహల్ : ది గ్రేటెస్ట్ ఆఫ్‌ఆల్ టైమ్ (గోట్)

ధవళేశ్వరం

మీఎస్ మహల్ : ది గ్రేటెస్ట్ ఆఫ్‌ఆల్ టైమ్ (గోట్)

కడియం

వెంకటసూర్య : ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్)

మట్టి విగ్రహం.. పర్యావరణ హితం



సత్యసాయి గురుకులంలో మట్టి గణపతులతో విద్యార్థులు



లడ్డూలకు ప్రత్యేక అలంకరణ చేస్తున్న తయారీదారుడు



వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న చాంబర్ కార్యదర్శి మురళీకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దానిలో భాగంగానే మట్టి గణనాథుని ప్రతిమలతోనే వినాయక చవితి పర్వదినాన్ని జరుపుకోవాలని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య అన్నారు. గురుకులంలో శుక్రవారం సాయంత్రం మట్టి గణపతి ప్రతిమల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేస్తున్న విగ్రహాలతో నీటి వనరులు కలుషితం అవుతున్నాయన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే ప్రతి ఏటా మట్టి గణపతి విగ్రహాలు విద్యార్థులతోనే చేయించి ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సుమారు 1200 ప్రతిమలు పాఠశాల విద్యార్థులకు అందించారు.

- కాతేరులోని మల్లయ్యపేటలో జనసేన కార్యకర్తలు యోగేంద్ర, మణికంఠ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

కడియపులంకలో..

కడియం: కడియపులంక గామ దేవత ముసలమ్మ అమ్మవారి ఆలయం వద్ద రాజానగరం ఐశ్వర్య రైస్ ఇండస్ట్రీస్ సమకూర్చిన 500 మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకథా పుస్తకాలు, 250 కుడుముల నూక ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

లడ్డూలకు అలంకరణ

రాజమహేంద్రవరం రూరల్: గణనాథుని విగ్రహాల చేతిలో పెట్టేందుకు అవసరమైన లడ్డూల తయారీ జోరుగా జరుగుతుంది. ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్వీట్ షాపుల్లో ఆర్డరు ఇచ్చి వీటిని తయారు చేయించుకుంటున్నారు. ఒక కేజీ దగ్గర నుంచి వంద కేజీల లడ్డూల వరకూ ఆర్డర్లు ఇస్తున్నారు. తయారు చేసిన లడ్డూలను ప్రత్యేక అలంకరిస్తున్నారు.

మట్టి ప్రతిమలనే పూజించాలి

రాజమహేంద్రవరం సిటీ: మట్టి వినాయకులను పూజిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ది రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సీపీ రెడ్డి ఆటో మొబైల్స్ షోరూమ్ వద్ద శుక్రవారం వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు పాల కృష్ణ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో 1200 వినాయక మట్టి ప్రతిమలను భక్తులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మానవత కన్వీనర్ బీఎస్ఎన్ మూర్తి, సెక్రటరీ ఉప్పల శ్రీను, జాయింట్ సెక్రటరీ బొదిరెడ్ల అప్పారావు రెడ్డి, ట్రెజరర్ సాయిబాబా, కొమ్మా శ్రీనివాస్ పాల్గొన్నారు.